క్లుప్తంగా

గుండెపోటుతో వార్డుసభ్యుడి మృతి


సాయినాథ్(ఫైల్)

భైంసారూరల్: మండలంలోని కోతల్‌గాం గ్రామానికి చెందిన వార్డుసభ్యుడు చందులవార్ సాయినాథ్ (32) గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడి కుటుంబసభ్యుల వివరాల ప్రకారం సోమవారం రాత్రి సాయినాథ్ అందరితో కలిసి భోజనం చేశాడు. అనంతరం టీవీ చూస్తూ కిందపడిపోగా కుటుంబసభ్యులు వెంటనే భైంసా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

భూకంప మృతులకు నివాళి

కుంటాల: మండల కేంద్రంలోని శాంతినికేతన్ విద్యాలయంలో తుర్కియే, సిరియాలో సంభవించిన భూకంప ప్రమాదంలో మృతి చెందిన వారికి నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ప్రిన్సిపాల్ సంతోశ్, డైరెక్టర్ ప్రవీణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులు పరిశీలన


పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో లింబాద్రి

కడెం: ఉపాధిహామీ పథకం కింద చేపట్టే పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో లింబాద్రి అన్నారు. మంగళవారం మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామంలో ఫిష్‌పాండ్ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డు గంగన్న, ఏపీవో జయదేవ్, ఎఫ్ఏ కమలాకర్, తదితరులు ఉన్నారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ

తానూరు: మండల కేంద్రంలోని భవిత విద్యావనరుల కేంద్రంలో మంగళవారం దివ్యాంగులైన విద్యార్థులకు ఫిజియోథెరపీ నిర్వహించారు. మొతం 26 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందించినట్లు ఫిజియోథెరపిస్ట్ శ్రీనివాస్ తెలిపారు. ప్రతి మంగళవారం భవిత విద్యావనరుల కేంద్రంలో నిర్వహించే శిబిరం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐఆర్‌టీ భూమన్న, రాము సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆరె మరాఠా జిల్లా కార్యవర్గం


ఎన్నికైన సభ్యులు

భైంసాటౌన్: పట్టణంలో ఆరె మరాఠా జిల్లా కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. స్థానిక నర్సింహా కల్యాణమండపంలో రాష్ట్ర అధ్యక్షుడు షెట్పల్లి శివాజీపాటిల్ నేతృత్వంలో జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జీకే సుదర్శన్‌పాటిల్, ప్రధాన కార్యదర్శిగా పుండ్లిక్‌రావ్ పాటిల్, ఉపాధ్యక్షులుగా నాగేందర్‌పాటిల్, మాధవ్‌రావ్, కోశాధికారిగా లింగురాంను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని సన్మానించారు.

కలెక్టర్‌ను కలిసిన దిశా సభ్యులు


కలెక్టర్‌ను కలిసిన దిశా సభ్యులు

నిర్మల్‌చైన్‌గేట్: నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన వరుణ్‌రెడ్డిని బీజేపీ ఆధ్వర్యంలో దిశా కమిటీ సభ్యులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి అమరవేణి నర్సాగౌడ్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శులు భాస్కర్, నరేశ్, ఓడిసెల శ్రీనివాస్ ఉన్నారు.

స్పోర్ట్స్ కిట్లు పంపిణీ


క్రీడాకారులతో చైర్మన్ ఈశ్వర్, నాయకులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ పలువురు క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 10 నుంచి బిహార్‌లోని పాట్నాలో జరిగే జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు కిట్లు అందించారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పద్మనాభగౌడ్, సెక్రెటరీ శ్యామూల్, పీఈటీలు సత్తయ్య, దేవేందర్, సాయికుమారి ఉన్నారు.

వేడుకలకు ముస్తాబైన ఆలయం

- నేటి నుంచి 10వరకు శివపంచాయితన ఉత్సవాలు
- చివరిరోజు శివపార్వతుల విగ్రహాల పునఃప్రతిష్ఠాపన


వీరన్నగుట్ట శివాలయం


ఉత్సవమూర్తులు


రాతిపై చెక్కిన శివలింగం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని నాయుడువాడలో కొలువు దీరిన గుట్ట వీరన్న శివాలయం వేడుకలకు ముస్తాబైంది. ఈ ఆలయంలో శివ పంచాయితన యంత్ర పునఃప్రతిష్ఠాపన ఉత్సవాలు మూడు రోజులపాటు(ఈనెల 8నుంచి 10వరకు) నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు సర్వం సిద్ధం చేశారు.

మూడు రోజులపాటు ఉత్సవాలు..

శ్రీ గుట్ట వీరన్న శివాలయ విగ్రహ ప్రతిష్ఠాపన శ్రీ శివ పంచాయితన యంత్ర ప్రతిష్ఠాపన నేటి నుంచి మూడు రోజుల పాటు జరగనుంది. మొదటిరోజు బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు గణపతిపూజ, పుణ్యాహవాచన, రక్షాబంధన, అంకురార్పణ, పంచగవ్య ప్రాశన, రుత్విక్వర్ణ, యాగశాల ప్రవేశ మండప ఆరాధన, అఖండ దీపారాధన, హారతి, తీర్థప్రసాదం నిర్వహిస్తారు. సాయంత్రం ఆరు గంటలకు స్థాపిత మండప ఆరాధన, స్థాపిత హోమాలు, విగ్రహాలకు, జలాదివాసం, అదివాస హోమము, హారతి, తీర్థ ప్రసాద వితరణ వంటి కార్యక్రమాలు జరుగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు.

రెండోరోజు..

రెండో రోజైన గురువారం ఉదయం తొమ్మిది గంటలకు గణపతి పూజ, మండప ఆరాధన, పంచామృత అభిషేకం, రుద్రహోమాలు, మహాహారతి అనంతరం సాయంత్రం ఆరు గంటలకు విగ్రహానికి పుష్ప, దూప, గంధ, ఫల, ధాన్య, శయ్యాది వాసములతోపాటు మహిళలు కుంకుమార్చనల పూజలు చేస్తారు.

మూడో రోజు..

శుక్రవారం ఉదయం 9:15 గంటలకు బాసరకు చెందిన యజ్ఞ బ్రహ్మ శ్రీ బాలాజీ ఆచార్యుల వారిచే శివ పంచాయతన యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ జరుగును. ప్రతిష్ఠ హోమము, బలిహరణం, మహా పూర్ణాహుతి, కలశ ఉద్వాసన, సంప్రోక్షణ కుంభాభిషేకం, వేదాశీర్వచన, తీర్థ ప్రసాద వితరణ అనంతరం మధ్యాహ్నం అన్నదానం నిర్వహిస్తారు.

బండపై శివలింగ ప్రతిమ..

సుమారు 400 ఏళ్ల కిందట నిమ్మనాయుడు నిర్మల్‌ను పాలించే సమయంలో ఈ శివలింగం వెలుగులోకి వచ్చిందని పూర్వీకులు తెలిపేవారు. నిమ్మనాయుడు రోజూ వచ్చి కిల్లగుట్టపైన ఉన్న హనుమాన్ ఆలయం, గుట్ట రాతిపై చెక్కభజన శివలింగాన్ని దర్శించుకునేవాడని చెప్పుకుంటారు. వారి కాలం నుంచే ప్రతి శివరాత్రికి, ఉగాదికి పెద్దఎత్తున జాతర నిర్వహించేవారని పురాణాలు చెబుతున్నాయి.

నిధులతో ఆలయ నిర్మాణం, సౌకర్యాలు

ఎంతో ప్రాశస్త్యం కల్గిన ఈ శివాలయ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి రూ.10 లక్షల నిధులు మంజూరు చేయడంతో దీని రూపురేఖలే మారిపోయాయి. గుట్టపైకి వెళ్లేందుకు మెట్లకు ఇరువైపులా రోలింగ్, గుట్టపై ఏర్పడిన రాతి శివలింగానికి నూతన ఆలయం, గోపురం నిర్మించారు. శ్రీ గుట్ట వీరన్న అభివృద్ధి కమిటీ నాయుడువాడ ఆధ్వర్యంలో 15 అడుగుల త్రిశూలం, శివపార్వతుల ప్రతిమలు, ఉత్సవమూర్తులు, గాలిగోపురాలు, సౌండ్ సిస్టం, ఉత్సవమూర్తులకు వెండి తొడుగులు, పల్లకీ సమకూర్చారు.

అటెన్షన్ ప్లీజ్.. రోడ్డు ఇలా.. ప్రయాణం ఎలా?



కుభీర్: మండలంలోని వీర్‌గాం నుంచి హల్దా వెళ్లే మార్గంలో రోడ్డు కంకర తేలి ప్రమాదకరంగా మారింది. రెండేళ్ల కిందటే ఈ రోడ్డుకు నిధులు మంజూరైనట్లు అధికారులు చెబుతున్నా ఇప్పటికీ పనులు ప్రారంభించలేదు. రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నామని అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: సూర్యతేజ, పీఆర్ ఏఈ, కుభీర్, **ఫోన్:** 7702888482

లెక్కల మాస్టార్.. కలెక్టర్!



ఖానాపూర్ మండలంలోని మస్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మంగళవారం కలెక్టర్ వరుణ్‌రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు కాసేపు గణితం బోధించారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. అనంతరం మనఊరు- మనబడి పనుల వివరాలు తెలుసుకొని అదే గ్రామంలోని కేజీబీవీని సందర్శించారు. - ఖానాపూర్

రమాబాయి అంబేద్కర్‌కు నివాళి


సారంగపూర్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు


భైంసాలో నివాళులర్పిస్తున్న నాయకులు

సారంగపూర్: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహం ఎదుట రమాబాయి అంబేద్కర్ జయంతి నిర్వహించారు. అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో రమాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సంఘం మండలాధ్యక్షుడు పిల్లి నాగయ్య మాట్లాడుతూ రమాబాయి ఇచ్చిన ప్రోత్సాహంతోనే అంబేద్కర్ ఉన్నత చదువులు అభ్యసించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మురళీధర్, దేవిముత్యం, శంకర్, ముత్యం, నరేశ్, సాయన్న, రాజశేఖర్, సన్ని రమేశ్, రఘు, లక్ష్మణ్, సాయన్న, సుధాకర్ తదితరులు ఉన్నారు.

భైంసా: మాతా రమాబాయి సేవలు చిరస్మరణీయమని బీఎస్‌ఐ భైంసా అధ్యక్షులు ప్రసంజిత్‌హిమ్మే అన్నారు. మంగళవారం భైంసా పట్టణంలోని రాహుల్‌నగర్, ఏపీ నగర్, మండలంలోని మిర్జాపూర్ ఉన్నత పాఠశాలలో రమాబాయి జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతా రమాబాయిని నేటి మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

'కంటివెలుగు' సద్వినియోగం చేసుకోవాలి


వివరాలు తెలుసుకుంటున్న తహసీల్దార్ శ్రీకాంత్

నర్సాపూర్(జి): మండలంలోని చాక్‌పల్లి గ్రామంలో ఈనెల 9న కంటివెలుగు శిబిరం ప్రారంభించనున్నారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ శ్రీకాంత్ పంచాయతీ కార్యాలయం పరిశీలించారు. ఈసందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. 13వరకు శిబిరం ఉంటుందని.. గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అల్లాడి వనజ, ఎంపీఓ శ్రీనివాస్‌గౌడ్, కార్యదర్శి నరేశ్‌కుమార్ ఉన్నారు.

కంటివెలుగుపై కళాజాత

కుంటాల: మండలంలోని ఓలా గ్రామంలో మంగళవారం కంటివెలుగు కార్యక్రమంపై కళాజాత నిర్వహించారు. సమాచార పౌరసంబంధాలశాఖ ఆధ్వర్యంలో కంటి పరీక్షలతో కలిగే ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కనీష్ ఫాతిమా, పంచాయతీ కార్యదర్శి సుమన్, కళాకారులు తోట లక్ష్మణ్, సుధాకర్, సుదర్శన్, నర్సయ్య, తస్లీమా, మాధవి తదితరులు ఉన్నారు.

శిబిరం ప్రారంభం..

భైంసారూరల్: మండలంలోని లింగా గ్రామంలో కంటివెలుగు కేంద్రాన్ని సర్పంచ్ గణేశ్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రజాక్, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ గోపాలకృష్ణారెడ్డి, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

మొక్కలు ఎండిపోకుండా చూడాలి

లోకేశ్వరం: గ్రామాల్లోని నర్సరీల్లో పెంచే మొక్కలు ఎండిపోకుండా ఎప్పటికప్పుడు నీరు అందించాలని ఎంపీడీవో సల్మాన్‌రాజ్ అన్నారు. మంగళవారం మండలంలోని రాజూర, బామ్ని(కె), నగర్ గ్రామాల్లోని నర్సరీ, పల్లె ప్రకృతివనం, సెగ్రిగేషన్ షెడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రకృతివనంలో పిచ్చిమొక్కలు తొలగించాలని సిబ్బందికి సూచించారు. గ్రామాల్లోని కూలీలు తప్పనిసరిగా ఉపాధి పనులకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. వారి వెంట ఏపీవో జగన్నాథ్, టీఏలు హరిత, రవికుమార్, శారత, మంజుల ఉన్నారు.

'సుకన్య సమృద్ధి'పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న పోస్టల్ అధికారి సుస్మిత

భైంసాటౌన్: ఆడపిల్లల బంగారు భవిష్యత్తుకు పోస్టల్‌శాఖలో సుకన్య సమృద్ధి యోజన ఖాతాను సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్‌శాఖ భైంసా అధికారి(ఐపీవో) సుస్మిత బెనర్జీ అన్నారు. మంగళవారం పట్టణంలోని పలు కాలనీల్లో ఇంటింటికీ తిరుగుతూ సుకన్య సమృద్ధి యోజన ఖాతాపై అవగాహన కల్పించారు. జమచేసిన మొత్తానికి 7.6 శాతం వడ్డీ వర్తిస్తుందని.. సమీపంలోని పోస్టాఫీసును సంప్రదించాలని సూచించారు. వారి వెంట పోస్టల్ సిబ్బంది ఉన్నారు.

మహిత కుటుంబాన్ని ఆదుకోవాలి


ఏవోకు వినతిపత్రం ఇస్తున్న బీజేవైఎం నేతలు

నిర్మల్‌చైన్‌గేట్: సారంగపూర్ మండలం జామ్ గ్రామంలోని బాలికల రెసిడెన్షియల్ స్కూల్లో ఇటీవల మృతి చెందిన ఐదో తరగతి విద్యార్థిని మహిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ బీజేవైఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో ఏవోకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా మహిత చనిపోయిందని.. బాధిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు నెలకోసారి వైద్యపరీక్షలు నిర్వహించాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రిన్సిపాల్‌ను వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఒడిసెల అర్జున్, అసెంబ్లీ కన్వీనర్ కొండాజి శ్రావణ్, జిల్లా ఉపాధ్యక్షుడు రావులవార్ విట్టల్, జిల్లా కార్యదర్శి ఆకుల కార్తీక్, ముత్యం, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీకి మంచి పేరు తేవాలి


మాట్లాడుతున్న రీజియన్ మేనేజర్ జానీరెడ్డి

భైంసాటౌన్: ఆర్టీసీ సంస్థనే ప్రయాణికులపై ఆధారపడి ఉందని..జాగ్రత్తగా విధులు నిర్వర్తిస్తూ ఆర్టీసీకి మంచి పేరు తేవాలని ఆదిలాబాద్ రీజియన్ మేనేజర్ కె.జానీరెడ్డి అన్నారు. హైర్‌బస్ డ్రైవర్లకు సేఫ్టీ డ్రైవింగ్ అంశంపై శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రయాణికులతో మర్యాదగా నడుచుకోవాలని, వారు చేయి ఎత్తిన చోట బస్సు ఆపాలని, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేయవద్దని సూచించారు. డీఎం అమృత, ఉద్యోగులు హైమద్, ఉమాకాంత్‌రావ్, తదితరులు ఉన్నారు.

'పోడు' పట్టాలివ్వాలని వినతి

పెంబి: అర్హులందరికీ పోడు భూముల పట్టాలు ఇవ్వాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు సర్దార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్‌కు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 16 ఏళ్లు గడుస్తున్నా.. అటవీ చట్టం–2006 అమలవడం లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోవడం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి మంచికంటి లక్ష్మణ్, తుకారాం, భీంరావు, నారాయణ, బద్రి ఉన్నారు.

'బీఆర్ఎస్‌కు ప్రజలు బుద్ధి చెప్పాలి'


రాయదారిలో మాట్లాడుతున్న మల్లికార్జున్‌రెడ్డి

మామడ: ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీఆర్ఎస్‌కు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని బీజేపీ నాయకుడు డా.మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని రాయదారి, లింగాపూర్ గ్రామాల్లో పర్యటించి మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులకు భారం కాకుండా యూరియాపై సబ్సిడీ అందిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయుడు మురళీధర్, కొరిపెల్లి శ్రావణ్‌రెడ్డి, లింగారెడ్డి, లింగన్న, వేంకటేశ్వర్‌రావ్, రాములు, నరేశ్, దినేశ్, అరుణ్, రవీందర్, శ్రావణ్, నరేందర్, గంగన్న ఉన్నారు.

బీజేపీ గెలుపునకు కృషి చేయాలి

తానూరు: వచ్చే ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఇంటింటికీ వివరించాలన్నారు. కార్యక్రమంలో భైంసా కౌన్సిలర్ పోశెట్టి, జిల్లా కార్యదర్శి రమేశ్, సాయినాథ్, గోపాల్‌స్వామి తదితరులు ఉన్నారు.

శక్తి కేంద్రం వర్క్‌షాప్‌కు బీజేపీ జిల్లా నేతలు

నిర్మల్‌చైన్‌గేట్: హైదరాబాదులోని వేద కన్వెన్షన్ హాల్‌లో నిర్వహిస్తున్న 11 వేల శక్తి కేంద్రాల బహిరంగ సభల వర్క్‌షాప్‌కు బీజేపీ జిల్లా నాయకులు హాజరయ్యారు. జిల్లా అధ్యక్షురాలు పడకంటి రమాదేవి, పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, పెద్దపెల్లి ఇన్‌చార్జి రావుల రాంనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు మెడిసెమ్మె రాజు, సామ రాజేశ్వర్‌రెడ్డి, గణేశ్, హరినాయక్, భోజారెడ్డి, అశోక్ హాజరయ్యారు.

ఓటుహక్కుపై అవగాహన

తానూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఓటుహక్కు ప్రాధాన్యతపై ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎన్నికల సంఘం రూపొందించిన వీడియోను విద్యార్థులకు చూపించారు. అధ్యాపకులు నరేశ్, లక్ష్మణ్, రాజేందర్, సాయినాథ్, దీనాజీ, జనార్దన్ పాల్గొన్నారు.

క్రికెట్‌లీగ్ ప్రారంభం

భైంసా: బాసర మండల కేంద్రంలో మంగళవారం క్రికెట్ లీగ్‌ను భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ ప్రారంభించారు. మీడియా క్రికెట్ లీగ్ మ్యాచ్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటలు శారీరక, మానసికోల్లాసానికి దోహదం చేస్తాయని పేర్కొన్నారు.

'డబుల్' పనులు పరిశీలన

కుంటాల: డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి సుదర్శన్ అన్నారు. మంగళవారం మండలంలోని లింబా(బి)లో కొనసాగుతున్న డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణ పనులు పరిశీలించి మాట్లాడారు. అనంతరం నర్సరీ, కంటివెలుగు శిబిరం పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వారి వెంట ఎంపీడీఓ దేవేందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుమన్ తదితరులు ఉన్నారు.

కుట్టుమిషన్లు పంపిణీ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని వశిష్ఠ డిగ్రీ కళాశాలలో ఉష ఇంటర్నేషనల్ లిమిటెడ్ సహకారంతో, సర్వోదయ శ్రీనివాస్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రారంభించిన ఉచిత టైలరింగ్ శిక్షణ మంగళవారం ముగిసింది. ఈసందర్భంగా శిక్షణ పొందిన 15 మందికి కుట్టుమిషన్లు, బుక్‌లను డీటీడీఓ సౌజన్య అందించారు. కార్యక్రమంలో ఉషా లిమిటెడ్ డిప్యూటీ మేనేజర్ రాజ్‌కుమార్, సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్ అఖిలేష్, మహిళలు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి ఆర్థికసాయం అందజేత

సాక్షి ఎఫెక్ట్..


నిఖితకు సాయం అందిస్తున్న మిత్రబృందం

ఖానాపూర్: పట్టణానికి చెందిన జక్కుల నిఖిత అనే అండర్ ఆర్మ్ క్రీడాకారిణి అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు భారత జట్టుకు ఎంపికైంది. ఈమె దీన స్థితి తెలుసుకున్న సాక్షి గత నెల 23న 'చేయూత కోసం క్రీడాకారిణి ఎదురుచూపు' అనే శీర్షికన కథనం ప్రచురితం చేసింది. స్పందించిన పలువురు దాతలు ఇటీవల లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రూ.తొమ్మిది వేలు అందించారు. మంగళవారం ఖానాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 1999–2000 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు రూ.10వేల ఆర్థికసాయం అందించారు. అనంతరం ఆమెను సన్మానించారు. నిఖిత చిన్నతనంలోనే తండ్రి మరణించగా కుటుంబభారం తల్లి గంగామణి భుజాలకెత్తుకుంది. నేపాల్‌లో జరిగే పోటీల్లో పాల్గొనేందుకు సుమారు రూ.50వేల వరకు ఖర్చవుతాయని.. దాతలు ఆదుకోవాలని క్రీడాకారిణి వేడుకుంటోంది.

ఉల్లాసంగా వార్షికోత్సవం


నృత్యం చేస్తున్న చిన్నారులు

సారంగపూర్: మండల కేంద్రంలోని వివేకానంద పాఠశాలలో మంగళవారం పాఠశాల 20వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు తయారు చేసిన వివిధ వస్తువులను ప్రదర్శించారు. కరస్పాండెంట్ రమణారావు మాట్లాడు తూ సముద్రాల హన్మంతురావు ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాఠశాల ఎంతో మందిని ఉన్నతంగా తీర్చిదిద్దిందని పేర్కొన్నారు.